



సిఎంను కలిసిన బంగార్రాజు

ప్రజాశక్తి-డెంకాడ

రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా సరఫరాపై నివేదికను సిఎంకు అందించారు. నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రికి వివరించారు.



ఎరువుల నివేదికను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

సమాజ అభివృద్ధిలో

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో కలెక్టర్ అంబేద్కర్, ఎమ్మెల్యే కళావెంకటరావు, ఎమ్మెల్సీ గాదె, తదితరులు

- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- ఘనంగా టీచర్స్‌డే వేడుకలు
- 76 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఉపాధ్యాయ పని వృత్తి కాదని, సమాజం రూపు రేఖలు మార్చే శక్తియని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి కాదని, ఒక సామాజిక బాధ్యతని, అటువంటి ఉపాధ్యాయుల్ని సత్కరించుకోవడం ఎంతయినా అవసరమని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియం లో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యాన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అతిథులంతా తొలుత రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి గదిలో పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దే ఉపాధ్యాయులు సమాజంలో గౌరవ ప్రదమైన వారని, వారిని సన్మానించు కోవడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు.

చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు మాట్లాడుతూ ప్రపంచంలో గొప్పవారినందరిని తీర్చి దిద్దింది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక విజన్‌తో రాష్ట్రాన్ని సంక్షేమ, అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని తెలిపారు. నారా లోకేష్ విద్యా శాఖామంత్రి గా అనేక సంస్కరణలను తీసుకు వచ్చారని, పేదలు కూడా గొప్పగా చదువుకునే రోజులు వచ్చాయని తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూఉపాధ్యాయులు బోధనాంశాలతో పాటు నైతిక విలువలు, మన సంస్కృతి, సంప్రదాయాల గురించి కూడా బోధించాలని తెలిపారు. ఎంఎల్‌సి డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి దండ్రులతో పాటు ఉపాధ్యాయులను కూడా గుర్తు పెట్టుకుంటారని , అంతటి గొప్ప వృత్తి ఉపాధ్యాయ వృత్తేనని అన్నారు. డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర వహిస్తున్నారని అన్నారు. డిఇఒ మాణిక్యం నాయుడు ప్రారంభ ఉపన్యాసం చేస్తూ విద్యాశాఖ ప్రాధాన్యత, ఉపాధ్యాయుల పాత్ర, జిల్లాలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని వివరించారు. తల్లిదండ్రుల తర్వాత దైవంగా కొలిచే ఉపాధ్యాయుడు తరగతి గదిలో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 76 మందిని అతిథులంతా సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రామారావు, డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ; నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గిరిజనుల పొట్టకొట్టిన పరిశ్రమలు

- ఎంఎస్‌ఎంఇ పార్కుతో జీవనం కోల్పోనున్న 50 కుటుంబాలు
- ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం
- గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకోమంటున్న సిపిఎం, వైసిపి



ఎంఎస్‌ఎంఇ పార్కు ఏర్పాటు చేయనున్న స్థలమిదే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందట. అచ్చంగా అలాగే ఉంది మిర్తివలస పంచాయతీ పరిధిలో తలపెట్టిన ఎంఎస్‌ఎంఇ పార్కు పరిస్థితి. ఎంఎస్‌ఎంఇ పార్కులో ఎలాంటి పరిశ్రమలు వస్తాయో..! ఎంతమందికి ఉపాధి కలుగుతుందో? అది కూడా ఎప్పటికి సాధ్యమౌతుందో తెలియదుగానీ ఇప్పటికిప్పుడు 50గిరిజన కుటుంబాల జీవనోపాధికి విఘాతం కలుగుతోంది. ఎంఎస్‌ఎంఇ పార్కు పేరిట భూములు లాక్కోవడానికి చూడడమే కాకుండా, వారి జీవనానికి ప్రత్యామ్నాయం గురించి కూడా కనీసం పట్టించుకోకపోవడమే ఇందుకు కారణం.

రామభద్రపురం మండలం మిర్తివలస పంచాయతీ పరిధిలోని కాకర్లవలస, కారేడువలస గ్రామాల్లో సుమారు 50 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. వీరి సంక్షేమం, ఆయా గ్రామాల అభివృద్ధి ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోకపోయినప్పటికీ రెక్కల కష్టంతోనే బతుకీడుస్తున్నారు. గ్రామాలకు కనీసం పక్కారోడ్లు గానీ, గ్రామాల్లో కాలువలు గానీ నిర్మించకపోవడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లోనూ గ్రామాలకు అనుకునివున్న ప్రభుత్వ బంజరు భూములను సాగుకు అనుగుణంగా తయారు చేసుకుని, పత్తి, మొక్కజొన్న, మామిడి, జీడి మామిడి వంటి పంటలు సాగుచేసుకుంటూ జీవనం వెల్లదీస్తున్నారు. ఇదే భూముల్లో 130 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కు ఏర్పాటు చేయడానికి ఇటీవల జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇటీవల జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఇతర అధికారులు కలిసి శంకుస్థాపన కూడా చేశారు. ఈ నేపథ్యంలో తాము జీవనోపాధి కోల్పోతామంటూ గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ వినిపించుకోని యంత్రాంగం జూలైలోనే ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా ఏపుగా పెరుగుతున్న మొక్కజొన్న, పత్తి తదితర పంటలను జెసిబిలతో తొలగించింది. దీనిపై అప్పట్లో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, అటు స్థానిక సర్పంచి రాంబాబు కూడా స్పందించారు. పరిశ్రమల పేరిట అమాయక గిరిజనులను మోసం చేయడం సరికాదని, చిత్తశుద్ధి ఉంటే దశాబ్దాల తరబడి ఖాళీగా ఉండిపోయిన బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వీరి వాదన. ఎత్తుపల్లాలుగా వున్న కొండవాలు ప్రాంతాన్ని తమ తాత తండ్రుల నుంచి కష్టపడి వ్యవసాయ యోగ్యంగా తయారు చేసుకున్నామని, ఇప్పటికిప్పుడు భూములు లాగేసుకుంటే ఎలా బతుకుతామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో గడిచిన నెలరోజుల్లో సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టిన సంగతి విధితమే. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి చలనం లేదు. ఈ భూమిని 2017లోనే అప్పటి టిడిపి ప్రభుత్వం సుమారు 187 ఎకరాల భూమిని రూ.7.48కోట్లకు ఎపిఐఐసికి విక్రయించిందని అధికార యంత్రాంగం చెబుతోంది. ఈ విషయం తమకెప్పుడూ చెప్పలేదని గిరిజనులు వాపోతున్నారు. కనీసం ఎపిఐఐసి బోర్డు కూడా ఏర్పాటు చేయకుండా ఇప్పటికిప్పుడు గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను పరిశ్రమల కోసం లాక్కుంటామనడం ఎంత వరకు సమంజసమని మండల వాసులంతా ముక్కునవేళ్లేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో సిపిఎం, వైసిపి వెన్నుదన్నుతో ప్రజాపోరాటానికి గిరిజనులు సిద్ధమౌతున్నారు. ఇదే అదునుగా ప్రభుత్వం కూడా గిరిజనుల పోరాటంపై ఉక్కుపాదం మోపింది. ఆందోళనచేస్తే అరెస్టు చేస్తామన్నట్టుగా వ్యవహరిస్తుండడంతో గిరిజనులు తమకు జరిగిన అన్యాయంపై మాట్లాడాలంటేనే పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా గిరిజనుల పొట్టకొట్టే ఆలోచన విరమించుకోవాలని, లేదంటే గిరిజనులకు అండగా నిలిచి పోరాటాన్ని జిల్లా వ్యాప్తంగా చేస్తామని సిపిఎం నాయకులు చెబుతున్నారు.



సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న నిర్వాసిత గిరిజనులు (ఫైల్)



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగను ముస్లిములను ఘనంగా నిర్వహించుకున్నారు. పలుచోట్ల ముస్లిములు ర్యాలీలు నిర్వహించారు. పోలీసుల బందోబస్తు, పోలీసు అధికారుల పర్యవేక్షణలో శాంతియుతంగా ర్యాలీలు ముగిశాయి. విజయనగరంలో ముస్లిములంతా భారీ ర్యాలీ చేపట్టారు. ఎస్.కోట, రాజాం, కొత్తవలస, బొబ్బిలిలో కూడా ర్యాలీలు నిర్వహించారు. విజయనగరంలో ఆబాద్‌వీధి నుండి ప్రారంభమైన ర్యాలీ కోట జంక్షన్, సింహాచలం మేడ, బాలాజీ జంక్షన్, ఆర్టీసి కాంప్లెక్స్, రైల్వే స్టేషను రోడ్డు, కన్యకా పరమేశ్వరి టెంపుల్, గంట స్థంభం, పైడితల్లమ్మ టెంపుల్, మూడు లాంతర్లు మీదుగా తిరిగి ఆబాద్‌వీధికి చేరింది. ర్యాలీలో సుమారు 1500 మంది ముస్లిం సోదరులు పాల్గొనగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ బందోబస్తులో విజయనగరం 1వ పట్టణ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా ఇప్పించండయ్యా

రైతుల ఆవేదన ● పోలీస్ బందోబస్తుతో యూరియా పంపిణీ

ప్రజాశక్తి - గరివిడి

యూరియా పాట్లు రైతులకు తప్పడం లేదు. నిత్యం ఏదో ఒక చోట యూరియా కోసం నానా అవస్థలు పడటం కనిపిస్తోంది. గరివిడి మండలంలోని వెదుల్లవలస గ్రామంలో యూరియా కోసం వందల మంది రైతులు బారులు తీరడంతో పోలీసుల సమక్షంలో పంపిణీ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. శుక్రవారం వెదుల్లవలసలో యూరియా పంపిణీ చేస్తారన్న విషయం తెలుసుకుని రైతులు భారీగా తరలివచ్చారు. వెదుల్లవలసలో సుమారు 1500 వన్‌బిలు, ఆవగూడెంలో 300 వన్‌బిలు ఉన్నాయి. కాని వచ్చినవి మాత్రం 267 బస్తాలేనని తెలియడంతో రైతులు ఆందోళన చెందారు. తమకు ఎక్కడ యూరియా అందదేమోనన్న భయంతో ఉదయం నుంచే రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. దీంతో పరిస్థితిని గమనించిన వ్యవసాయ శాఖ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసుల సమక్షంలో ఎడి ఎన్.కోటేశ్వరరావు, ఎఒ ప్రసాదరావు యూరియాను పంపిణీ చేశారు. 267 మంది రైతులకు యూరియా పంపిణీ చేసి, మిగతా వారి వివరాలు నమోదు చేసుకున్నారు. రెండు రోజుల్లో మిగతా వారికి యూరియా అందిస్తామని ఎఒ తెలిపారు. ఇంటిలో వన్‌బిలు ఎన్ని ఉన్నా ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని రైతుల ప్రశ్నించారు. వెదుల్లవలస గ్రామ చరిత్రలో ఇటువంటి సంఘటన జరగడం మొదటిసారని ఆవేదన వ్యక్తపరిచారు. యూరియా ఇవ్వడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. రైతుల కష్టాలను అర్థం చేసుకొని సరిపడా ఎరువులు ఇవ్వాలని కోరారు.



గరివిడి మండలం వెదుల్లవలసలో బారులు తీరిన రైతులు



సంతకవిటి.. సీజ్ చేసిన వాటిని తరలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణం సీజ్

సంతకవిటి : లైసెన్స్ లేకుండా ఎరువులు, పురుగుల మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారి సిహెచ్.ఎర్రన్నాయుడు అన్నారు. శుక్రవారం సిరిపురంలోని బాలాజీ ఏజెన్సీ దుకాణాన్ని శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు దుకాణానికి లైసెన్స్ లేకపోవడంతో రూ.31,553 విలువైన ఎరువులు, రూ.79,691 విలువ గల పురుగుల మందులను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. ఈ మేరకు డీలర్ బూరాడ విశ్వేశ్వరరావు పై 6ఎ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ దాడుల్లో ఎస్ఐ బి.రామారావు, ఎఒ సిబి యశ్వంత్ రావు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న వైసిపి నేత బొత్స సత్యనారాయణ

రైతులకు అండగా నిలుద్దాం : బొత్స

ప్రజాశక్తి - గరివిడి

జిల్లాలో రైతులు యూరియా సమస్యను ఎదుర్కొంటున్నారని, వారికి అండగా నిలవాలని వైసిపి శ్రేణులకు ఆ పార్టీ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం వైసిపి క్యాంపు కార్యాలయంలో చీపురుపల్లి నియోజకవర్గం నాయకులతో సమావేశం నిర్వహించారు. తాజా పరిస్థితులు, సమస్యలపై చర్చించారు. రైతులకు సరిపడే ఎరువులను అందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9 నిర్వహించనున్న ఆర్‌డిఒ కేంద్రాల్లో నిర్వహించే ఆందోళనలో రైతులంతా పాల్గొనాలని కోరారు.

సమాచార శాఖ ఎడి గోవిందరాజులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులుగా నియమితులైన పి.గోవింద రాజులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా డిపిఆర్‌ఒగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. గోవిందరాజులు ఇంతకుముందు జిల్లాలో ఎపిఆర్‌ఒగా, డివిజనల్ పిఆర్‌ఒగా , ఇంచార్జి డిపిఆర్‌గా కూడా పని చేశారు. ఎడిగా బాధ్యతలను స్వీకరించిన గోవిందరాజులను సమాచారశాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రచారం చేయాలని కోరారు. సిబ్బంది అంతా పరస్పరం సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

ఆలిండియా ట్రేడ్ టెస్ట్ ఫలితాల్లో సాయికి 600 మార్కులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఎర్ల సాయి (600 మార్కులు)

ఇటీవల జరిగిన ఆలిండియా ట్రేడ్ టెస్ట్ 2025 పరీక్ష ఫలితాల్లో విజయనగరం ప్రభుత్వ ఐటిఐలో చదివిన ఎర్ల సాయి సీనియర్ ఎలక్ట్రీషియన్ విభాగంలో 600 మార్కులకు గాను 600 మార్కులు సాధించి జాతీయ స్థాయి లో మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సీనియర్ ఎలక్ట్రీషియన్ విభాగంలో 590 మార్కులు దాటి ఆరుగురు విద్యార్థులు సంపాదించారు. జూనియర్ ఎలక్ట్రీషియన్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. త్వరలో విద్యార్థులను వారి తల్లీదండ్రులకు, ఇన్‌స్ట్రక్టర్ శ్రీధర్‌కు కాన్వొకేషన్ ప్రోగ్రాం ద్వారా అభినందన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీనియర్ ఎలక్ట్రీషియన్ విభాగంలో 590 మార్కులు దాటిన విద్యార్థుల్లో ఇ.సాయి, ఒ.రఘునాథ్, ఎల్.రఘునాథ్, వై.ప్రణీత్, డి.జయకిరణ్, పి.సాయి చైతన్య ఉన్నారు. జూనియర్ ఎలక్ట్రీషియన్ విభాగంలో జెవిడి చంద్రశేఖర్ 593, ఎస్.వరప్రసాద్ 591 మార్కులు సాధించారు. విజయనగరం ప్రభుత్వ ఐటిఐకి తొలిసారి ఇటువంటి ఫలితాలు రావడం గర్వంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ గిరి, సిబ్బంది తెలిపారు.

కుటుంబ కలహాలతోనే హత్య

కొత్తబగ్గాం హత్య ఘటనలో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో ఈనెల 2 హత్యకు గురైన పసుపురెడ్డిశ్రీను (45) హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కొత్తబగ్గాంలోని ఎస్‌సి కాలనీలో నివాసముంటున్న పసుపురెడ్డి శ్రీనును బుధవారం రాత్రి ఆయన సొంత తమ్ముడు పసుపురెడ్డి చంటి, గుమ్మడి రామచంద్రుడు కలసి గొంతుకోసం హత్య చేశారని తెలిపారు. శ్రీను భార్య జ్యోతిఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. క్యూస్ టీం సహకారంతో దర్యాప్తు చేయగా శ్రీనును ఆయన సోదరుడు పసుపురెడ్డి చంటి, గుమ్మడి రామచంద్రుడు పథకం ప్రకారం హత్య చేసినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా అన్నదమ్ముల మధ్య కుటుంబ కలహాలతో కక్షలు పెంచుకున్నారని తెలిపారు. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈనేపథ్యంలోనే ఈనెల 2 వ తేదీన కొత్తబగ్గాం గ్రామానికి సమీపంలో ఉన్న కొనిస జంక్షన్ వద్ద ఒక బడ్డీ షాపులో మద్యం తాగడానికి పసుపు రెడ్డి చంటి, గుమ్మడి రామచంద్రుడు వెళ్లగా అప్పటికే అక్కడ ఉన్న పసుపు రెడ్డి శ్రీను వారిని చూసి అసభ్య పదజాలంతో తిట్టడంతో గొడవ మొదలైనప్పటికీ, పసుపురెడ్డి చంటి మద్యం తాగి ఇంటికి వెళ్లిపోగా గుమ్మడి రామచంద్రుడు అక్కడే ఉన్నాడని తెలిపారు. అసభ్య పదజాలంతో రామచంద్రుడును శ్రీను తిట్టడంతో అక్కడ నుంచి చంటి ఇంటికి వెళ్లి ఎలాగైనా మీ అన్న శ్రీనును చంపేయాలని అని చెప్పాడని వివరించారు. ఇదే అదునుగా ఇంటి వద్ద ఉన్న కోడి కత్తిని తీసుకొని శ్రీను వచ్చే రోడ్డు మార్గంలో ఎవరూ లేని చీకటి ప్రదేశాన్ని ఎంచుకొని మాటు చంటి, రామచంద్రుడు కలసి శీనును పొదల్లోకి తీసుకొని వెళ్లి కోడి కత్తితో అతి కిరాతకంగా గొంతు కోసి చంపినట్లు వెల్లడించారు. ఈ మేరకు నిందితుల కోసం గాలిస్తుండగా పురిటిపెంట రైల్వేగేట్ సమీపంలో వారిని పట్టుకొని అరెస్టు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సిఐ జివి రమణ, ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

రేపు జిల్లా టెన్నికాయిట్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 13 నుంచి కోనసీమ జిల్లాలో జరగనున్న సబ్- జూనియర్, జూనియర్, సీనియర్ జిల్లా టెన్ని కాయిట్ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక ఈనెల 7న ఉదయం 9 గంటలకు రాజీవ్ క్రీడా మైదానంలో జరుగనుందని ఆసంఘం కార్యదర్శి ఇ.రామారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సీనియర్ 1-1-2011, జూనియర్ 1-1-2007 తేదీ తరువాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు.

ఒప్పందాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఫిబ్రవరి 10న కార్మిక శాఖ అధికారుల వద్ద చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు... జ్యూట్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. మాట్లాడుతూ మిల్లు లాకౌట్ చేసి 10 నెలలు, మిల్లు తెరిచి 6 నెలలు గడుస్తున్నా అధికారుల వద్ద జ్యూట్ యాజమాన్యం చేసిన ఒప్పందాలు చేయకపోవడం అన్యాయమన్నారు. ముఖ్యంగా జ్యూట్ యాజమాన్యం 2016 నుంచి 1200 మంది రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు చెల్లిస్తానని చెప్పి ఇంతవరకు ఒప్పందం అమలు చేయలేదన్నారు. 2023-24లో రిటైర్డ్ కార్మికుల నుంచి జ్యూట్ యాజమాన్యం వసూలు చేసి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, అరబిందో యాజమాన్యం బకాయిల విడుదల చేయాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. రామరాజు, డి.జగన్మోహన్ కోరారు. సమస్యలను పరష్కరించాలని ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ కుప్పిలి సాయి కుమార్‌కు శుక్రవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 9 వ తేదీ వరకు వివిధ రూపాల్లో తమ సమస్యలను ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియచేస్తామని తెలిపారు. నిత్యవసర ధరలకు అనుగుణంగా 104 ఉద్యోగులందరికీ వేతనాలు పెంచాలన్నారు. మాజీ యాజమాన్యం అయిన అరబిందో సంస్థ నుండి బకాయిలను, చట్టపరమైన చెల్లింపులను ఉద్యోగులకు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కండిషన్లో లేని 104 వాహనాలను తక్షణం మార్పుచేసి ఎప్పటికప్పుడు రిపేర్లు చేయాలని, ఉద్యోగులకు 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలనీ కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవి కిషోర్ రాజు, బంగారప్పడు, సంతోష్ కుమార్, గోవింద్ పాల్గొన్నారు.

7న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల రాత పరీక్ష

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డిఆర్‌ఒ ఆదేశం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించనున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ల రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి ఆదేశించారు. ఈ పరీక్షకు చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ, మన జిల్లాలో ఆదివారం జరిగే బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల రాత పరీక్షకు 6308 మంది, మధ్యాహ్నం జరిగే సెక్షన్ ఆఫీసర్ల పరీక్ష కు 910 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దీనికోసం విజయనగరంలోనే మొత్తం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులను గంట ముందే కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకురావాలనీ చెప్పారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ విధించాలని పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ బాబూరావు, సెక్షన్ ఆఫీసర్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కరరావు, ఆయా ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, లైజనింగ్ అధికారులు, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

జిందాల్ నిర్వాసితులను మోసం చేసేందుకు
రెవెన్యూ యంత్రాంగం కుట్ర : సిపిఎం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ నిర్వాసితులను మోసం చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం కుట్ర చేస్తోందని సిపిఎం చల్ల జగన్ తెలిపారు. శుక్రవారం బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులతో కలిపి రెవెన్యూ సిబ్బందికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భూములు తిరిగి ఇవ్వాలని 216 దరఖాస్తులను నిర్వాసితులు ఇస్తే, 16 దరఖాస్తులే వచ్చాయని రెవెన్యూ శాఖ ప్రకటించడం నిర్వాసితులను మోసం చేసే కుట్రేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుల విషయాలను పక్కనపెట్టి రెవెన్యూ అధికారులు వారికి నచ్చిన విధంగా రిపోర్టు తయారు చేయడానికి సిద్ధపడ్డారని తెలిపారు. అధికారులు వెల్లడించిన విషయాలను పరిశీలిస్తే ఉద్యమాన్ని నీరుకార్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు అర్థమవుతుందన్నారు. జిందాల్ యాజమాన్యానికి అనుకూలంగా రిపోర్టు తయారు చేస్తున్న తహశీల్దార్‌ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు

సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పద్మజ

ప్రజాశక్తి - కంటోన్మెంట్


సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మజ

విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ గా అల్లు పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆసుపత్రి అధికారులు, వైద్యులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో ఉన్న శ్రీఆంజనేయ స్వామి ఆలయ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా కింతలి బంగారురాజు, ఎనిమిది మంది డైరెక్టర్లు.. ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఆలయ అభివృద్ధికి పని చేయాలని నూతన పాలకవర్గ సభ్యులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విద్యా నిలయాలు

ప్రజాశక్తి-గుర్ల

గ్రంథాలయాలు విద్యా నిలయాలని తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.సంగం నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని పోలాయవలస గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఏర్పాటు చేసిన శాఖా గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

రేగిడి ఎస్ఐగా బాలకృష్ణ

ప్రజాశక్తి-రేగిడి



రేగిడి ఎస్ఐగా వి.బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మెరైన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ లీలావతి విజయనగరం ఎస్‌పి కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలు లోపించకుండా చర్యలు తీసుకున్నామన్నారు. గంజాయి, నాటు సారా, ఇతర మత్తు పదార్థాలపై నిఘా ఉంచామన్నారు. రాత్రివేళ గస్తీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విద్యుత్తు అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శృంగవరపుకోట : స్థానిక ఇపిడిసిఎల్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ సర్కిల్ ప్రాంగణంలో భారీ వృక్షాలను అనుమతి లేకుండా విద్యుత్తు శాఖ అధికారులు నరికివేయించడంపై శుక్రవారం కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లుగా న్యాయవాది, పర్యావరణ కార్యకర్త బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. చెట్లు నరకడం మనిషిని చంపడం కంటే దారుణమని, పర్యావరణానికి నష్టం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

108 వాహనం ప్రారంభం

కొత్తవలస : కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన నూతన 108 అంబులెన్స్ వాహనాన్ని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల ఉన్న అంబులెన్స్ పాడైపోవడంతో నూతన టెక్నాలజీతో గల నూతన అంబులెన్స్‌ను పిహెచ్‌సికి కేటాయించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లీట్ మేనేజర్ యూ. భాస్కరరావు, జిల్లా మేనేజర్ మన్మధ నాయుడు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ పల్లి రవి కుమార్, దాసరి సంక్షేమ సంఘం చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, కొత్తవలస పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి రాము పాల్గొన్నారు.

నాయుడువలసలో భారీ అన్న సమారాధన

రామభద్రపురం : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాయుడువలసలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 1700 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి యువత.. కారుణ్య ఫౌండేషన్, ఉపాధ్యాయులు జెసి రాజును సత్కరించారు.

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -వంగర

భార్యాభర్తలు గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని జగన్నాథవలసలో గురువారం చోటు చేసుకుంది. జగన్నాథవలస గ్రామానికి చెందిన గంధం చిన్నారావుతో శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన సాయి కుమారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో సూర్యకుమారి జి.సిగడాం పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. అయితే పెద్దల సమక్షంలో వీరిద్దరినీ రాజీ చేయడంతో భార్య భర్తలు కలిసి జగన్నాథ వలస గ్రామంలో ఉంటున్నారు. గురువారం తన భర్త చిన్నారావు బయటకు వెళ్లి ఆలస్యంగా ఇంటికి రావడంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో భార్యాభర్తలిద్దరూ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వీరిని రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారావు గ్రామంలో వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడమే ఈ ఘటనకు కారణమని సూర్యకుమారి బంధువులు ఆరోపిస్తున్నారు.

స్ఫూర్తి ప్రదాత సర్వేపల్లి


బొబ్బిలి.. ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ శరత్

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉపాధ్యాయులకు స్ఫూర్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ అని మున్సిపల్ చైర్మన్ ఆర్.శరత్ అన్నారు. శుక్రవారం ఇందిరమ్మకాలనీలో జవహర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి చిత్రపటానికి పులమాల వేశారు. పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, జాషువా, స్వాతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు ఆర్.జగదీష్, జె.చంద్రశేఖర్, టి.రామ్మోహన్, గంగరాజు, రాంబాబు, పి.గౌరీశంకర్, ఆర్.గోపి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

జ్ఞాన ప్రబోధకుడు గురువే..

ప్రపంచంలో జ్ఞాన ప్రబోధకుడు గురువేనని బ్రహ్మకుమారీస్ బొబ్బిలి శాఖ ఇన్‌ఛార్జి బిఆర్ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక ఉపఖజానా కార్యాలయ ప్రాంగణంలో ఉప ఖజానాధికారి పివి పద్మనాభం ఆధ్వర్యంలో మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా విస్తృతంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజును సన్మానించారు.

కృష్ణదాస్‌కు సన్మానం

బొబ్బిలి మండలం అలజంగి పాఠశాలలో పనిచేసి ఇటీవల సీతానగరం మండలం కు బదిలీ అయిన కె.కృష్ణదాస్ మాస్టారుకు పెంట క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుక్రవారం సాయంత్రం జరిగిన సత్కారంలో ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎం వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణదాస్ మాస్టారు నిరంతరం పిల్లల కోసమే పరితపిస్తుంటారని, విద్యార్థులకు మానవతా విలువలు బోధిస్తుంటారని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డును కూడా అందుకున్న ఆయన తన ఆధునిక బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థులకు మరిన్ని వినూత్న పద్ధతులను అందించాలని కోరారు. డెల్టా అధ్యక్షులు విజయ మోహన్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణం, పరస్పర సహకారం, సేవా కార్యక్రమాలు వంటి సమాజ హిత కార్యక్రమాలు చేపడుతూ కష్ణదాస్ మాస్టారు ఎంతోమంది ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయులని అన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలరామ నాయుడు, కాంప్లెక్స్ లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు

నలుగురికి అవార్డులు

ప్రజాశక్తి-వేపాడ

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు వేపాడ మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు మారిక పాఠశాల ఉపాధ్యాయులు తాడి రాంబాబు, కెజిపూడిలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఎ శ్రీనివాసరావు, బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి.అరుణకళ, బక్కునాయుడుపేట కెజిబివి ఉపాధ్యాయులు వివిఎస్ రోహిణి.. కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. వీరిని ఎంఇఒ, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది అభినందించారు.

జిల్లా వ్యాప్తంగా ఘనంగా టీచర్స్‌డే వేడుకలు

గరివిడి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్స్ డేను ప్రధానోపాధ్యాయులు ఎం.నిర్మల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామునాయుడు, బంగార్రాజు, బాలమురళీకృష్ణ, మానాప్రగడ సాహితీ, జెఎస్ఎన్ పాల్గొన్నారు.


నెల్లిమర్ల.. ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

అవంతీస్‌లో ఘనంగా వేడుకలు

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జె.బాల భాస్కరరావు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జెఎన్‌టియు-జివి ఎలక్ట్రికల్ విభాగాధిపతి, డాక్టర్ వి.ఎస్.వకుల మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించే అవకాశం ప్రపంచంలో ఒక్క ఉపాధ్యాయుడికే దక్కుతుందని తెలియజేశారు. అనంతరం డాక్టర్ వి.ఎస్.వకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓక్లాండ్‌లో టీచర్స్ డే వేడుకలు

పూసపాటిరేగ : పూసపాటిరేగలోని ఓక్లాండ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు చేపా, డైరెక్టర్ చేప రవి, చైర్మన్ శివ, ప్రిన్సిపల్ సరిత మండల్, కోఆర్డినేటర్ పీటర్ పాల్... డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు కేవలం విద్యార్థులకే కాకుండా సమాజానికీ, దేశానికీ మార్గదర్శకులని, గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని శ్రీనివాసరావు చేపా తెలిపారు. విద్యార్థులు తమ గురువుల పట్ల కృతజ్ఞత తెలియజేస్తూ పాటలు, సందేశాలు, నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు స్వయంగా సన్మానించి బహుమతులు అందజేశారు.

వేపాడ : మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేపాడలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. పిల్లలు పాటలు, పద్యాలు, ప్రసంగాలు చెబుతూ గురువుల గొప్పతనాన్ని వివరిస్తూ సందడి చేశారు.


వేపాడ.. సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీచర్ల వేషధారణలో అంగన్వాడీ చిన్నారులు

నెల్లిమర్ల : ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నెల్లిమర్లలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎపిటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.వి.పైడిరాజు.. ఉపాధ్యాయ ఉద్యమ నేతలకు నివాళులర్పించారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన మాతా రామకృష్ణ, కడలి రమేష్‌కుమార్‌ను సత్కరించారు.

జనసేన ఆధ్వర్యంలో సర్వేపల్లి జయంతి

విజయనగరం టౌన్ : జనసేన నేత గురాన అయ్యలు పార్టీ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పంచి క్రమశిక్షణ అలవర్చి జీవితాన్ని నడిపించే గురువులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని కీర్తిని తీసుకువచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో త్యాడ రామకృష్ణ, కొర్నాన రామకృష్ణ, పిడుగు సతీష్, ఎంటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా కిడ్స్ స్కూల్‌లో టీచర్స్‌డే

టీచర్స్‌డే వేడుకలు అయ్యన్నపేట జంక్షన్‌లో ఉన్న మదర్ థెరిసా కిడ్స్ స్కూల్ లో మదర్ థెరిసా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. విశ్రాంత ఉపాధ్యాయులు రొంగలి రామునాయుడుకు మదర్ థెరిసా కిడ్స్ స్కూల్ ప్రిన్సిపల్ త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో, సంఘ గౌరవాధ్యక్షులు త్యాడ వేణుగోపాలం చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో టీచర్స్- శ్రావణి, శిరీష, సంఘ సభ్యులు కీర్తన, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అవార్డు గ్రహీతలకు అభినందన

ప్రజాశక్తి-కొత్తవలస

జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని యుటిఎఫ్ అభినందించింది. కొత్తవలసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.కనకలక్ష్మి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బి.మోహనరావు, వియ్యంపేట తెలుగు ఉపాధ్యాయులు పి.రమేష్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వి.సూర్యకుమారి.. కలెక్టరేట్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరికి యుటిఎఫ్ నాయకులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా చిన్నశ్రీను జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

వైసిపి జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పెత్తఎత్తున ఆయన నివాసానికి చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికా, సిబ్బంది, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం, జిల్లా, పరిషత్ యూనిట్ సంఘ నాయకులు జిల్లా పరిషత్‌లో కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బి.వి.సత్యనారాయణ డిఎల్‌డిఒలు, ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ మురళి, రవి కుమార్ పాల్గొన్నారు. పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర, రాజాం నియోజక ఇన్‌ఛార్జి తలే రాజేష్, ఎంఎల్‌సి సురేష్ బాబు, విజయనగరం మేయరు వెంపడాపు విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, హాజరై జెడ్‌పి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి భోగాపురం మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ ఆధ్వర్యాన భారీ కేకును కట్ చేశారు. భీమిలి నియోజకవర్గం, ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో శుక్రవారం పాల్గొని చిన్న శ్రీను చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేకు కటింగ్ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ శారదా ప్రియాంక, మజ్జి వెంకట రావు పాల్గొన్నారు.


కేకు కట్ చేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి : జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను శుక్రవారం చీపురుపల్లిలో వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, బాపూజీ వృద్ధాశ్రమంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధులకు, రోగులకు పళ్ళు, రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో భారీ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ. సీనియర్ నాయకులు ఎస్.వి.రమణారాజు, దన్నాన జనార్దన, పతివాడ రాజారావు, బెల్లాన త్రినాథరావు, మంగళగిరి సుధారాణి శ్రీనివాస్, ఇప్పిలి గోవింద పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


ప్రజాశక్తి - గజపతినగరం

మండల కేంద్రంలోని శ్రీసాయి సిద్ధార్థ విద్యాసంస్థలు ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.పెద్ది నాయుడు, శారదా నాయుడు, ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మైత్రేయి ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 81 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్. చంద్రశేఖర్ మాస్టారు 48వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. 81 యూనిట్ల రక్తాన్ని విజయనగరం గవర్నమెంట్ మెడికల్ కాలేజి, గజపతినగరం ఏరియా ఆసుపత్రి డాక్టర్ల ఆధ్వర్యంలో సేకరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజి ప్రొఫెసర్ రత్నకుమారి, ప్రిన్సిపల్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ ఎస్.చంద్రశేఖర్

ప్రజా సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వంగర


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. వంగరలో శివ్వాం పిఎసిఎస్ అధ్యక్షుడిగా నియమితులైన బెజ్జిపురం రవిబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు రైతులకు ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తున్నామన్నారు. రాజాంలో త్వరలో పిజి సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. తొలుత వంగరలోని పెద్దవీధిలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గురాన నారాయణరావు, ఎఎంసి వైస్ చైర్మన్ లచ్చుబుక్త ధనలక్ష్మి కృష్ణమూర్తి, పైల వెంకటరమణ, వాసుదేవరావు నాయుడు, ఉదయాన మురళీకృష్ణారావు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ



ఆటో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ఈ నెల 17న జరిగే ఆటో డ్రైవర్ల జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం పూసపాటిరేగ బ్రిడ్జి సెంటర్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, ఎఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి నారాయణరావు, జాయింట్ సెక్రటరీ జి.నారాయణరావు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో, మ్యాక్స్ క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రోజు వారీగా రూ.500 సంపాదించి కుటుంబాలను పోషిస్తున్న ఆటో డ్రైవర్లు ఇప్పుడు ఉపాధి సంక్షోభంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతి లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్‌కు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్‌చేశారు. 1961 మోటార్ వాహన చట్టాన్ని సవరించాలని, రవాణా వ్యవస్థ ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని కోరారు. గుర్ల మండలం అచ్చుతాపురంలో ఏర్పాటు చేసిన వేదాంత ఫిట్నెస్ సెంటర్‌ను రద్దు చేయాలన్నారు. జిఒ 21ను సవరించి, టాక్స్‌లు, పెనాల్టీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించడంతో పాటు ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ డిమాండ్లపై చేపట్టే ఆటో బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.కొర్లయ్య, వి.రమణ ప్రకాశ్, సత్యం, రాము, రామసూరి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి
చెరువులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల


మృతిచెందిన గణపతి

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకొంది. చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని అలుగోలు గ్రామంలో గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అలుగోలు గ్రామానికి చెందిన పంచాది గణపతి (45) గురువారం రాత్రి వినాయక నిమజ్జనంలో పాల్గొన్నాడు. గుండాల చెరువు గట్టుపై ఉన్న కెల్ల నీలాకుమార్‌కు తన ఫోన్ ఇచ్చి, అందరితోపాటు వినాయక నిమజ్జనం చేయడానికి చెరువులో దిగాడు. అనంతరం అందరూ ఇంటికి వెళ్లియారు. నీలాకుమార్ ఫోన్ తీసుకుని గణపతి ఇంటికి వెళ్లగా, ఇంకా రాలేదని కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో అందరూ చెరువు దగ్గరికి వెళ్లి వినాయక నిమజ్జన ప్రదేశంలో వెతకగా గణపతి మృతదేహం కనిపించింది. గణపతి ఎల్ఐసి ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ బి.గణేష్ పరిశీలించి కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చీపురుపల్లి


శ్రీనివాసరావు(ఫైల్)

చీపురుపల్లి చెందిన నాదెళ్ల శ్రీనివాసరావు అనే పూర్వ రిపోర్టర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై.. శుక్రవారం మరణించాడు. గత నెల 29న స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చీపురుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయనగరం, అనంతరం విశాఖపట్నంలోని కెజిహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శ్రీనివాసరావు శుక్రవారం మృతి చెందాడు. నియోజకవర్గ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులంతా ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు చీపురుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ట్రాక్ పక్కన గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - కంటోన్మెంట్

బొండపల్లి మండలం గరుడ బిల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ పక్కన గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని విజయనగరం రైల్వే ఎస్ఐ వి.బాలాజీ రావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30ఏళ్లు ఉంటుందని, రైలు ఢీకొనడంగాని, రైలు నుంచి జారిపడిగాని మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడు పసుపు రంగు టీ షర్టు, నలుపు ట్రాక్ ప్యాంటు ధరించి, కుడి చేతికి నలని తాడు, ఎడమ చేతికి స్టీల్ ఉంగరం పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతిని వివరాలు తెలిసినట్లయితే 9490617089, 830 990038 , 9491813163 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు